క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న తలారి రవికుమార్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో పాటిమీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తలారి రవికుమార్ మంగళవారం విరాళం ఇచ్చారు. పురాతన ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ. 20 వేలను కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన అందజేశారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అబ్దులాపురంలో యువకుడు కిరణ్ సొంత నిధులతో మంగళవారం నుంచి ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయిస్తున్నాడు. గ్రామంలోని మంచినీటి పథకానికి చెందిన బోర్లలో నీరు తగ్గుముఖం పట్టడంతో కొన్ని కాలనీలకు పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య ఉన్న కాలనీలకు కిరణ్ ట్యాంకర్‌తో నీటి సరఫరా అందించడంతో ప్రజలకు ఉపశమనం లభిస్తుంది. గ్రామస్తులు కిరణ్‌కు అభినందనలు తెలిపారు.

మహానంది ఆలయం మరింత అభివృద్ధి

మహానంది: క్రోధినామ సంవత్సరంలో మహానంది ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో మంగళవారం రాత్రి పంచాంగ శ్రవణం కార్యక్రమం చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ.. మహానంది ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది ఎరుపు రంగు పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. మిశ్రమ ఫలితాలు ఉన్న రాశుల వారు ఎలాంటి ఆందోళన చెందకుండా నిత్యం దైవనామస్మరణ చేయడం ద్వారా కష్టాలు తొలగిపోతాయన్నారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ ఏ.నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు వైభవంగా చేపట్టారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంజీవనగర్, బైటిపేట కోదండరామాలయం, ఎస్బీఐ కాలనీ రామాలయం నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూలసాగరంలోని కోదండ రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రామాయణ పఠనం చేశారు. స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సిందూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు సమర్పించారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేదపండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కంబగిరిస్వామి ఉత్సవాలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం అల్లూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ గ్రామస్తులు తేరుబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్థానికులతో పాటు జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రైతులు పండితులు సూచించిన దిశకు వెళ్లి పొలాల్లో సేద్యపు పనులను ప్రారంభించారు.

టంగుటూరు... అభివృద్ధి చూడు!

- సచివాలయం, ఆర్బీకే భవన నిర్మాణాలతో పల్లెలకు పట్టణ శోభ
- మెరుస్తున్న సీసీ రోడ్లు



రూ.1.80 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలకు సైతం పట్టణ శోభ సంతరించుకుంది. సచివాలయం, ఆర్బీకే భవనాలతోపాటు సీసీ రోడ్లు నిర్మించడంతో గ్రామాలు మెరుస్తున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో మండల కేంద్రాలతోపాటు మారుమూల గ్రామాలకు సైతం మౌలిక వసతులు చేకూరడంతో కళకళలాడుతున్నాయి. ఈ మేరకు ఐదువేల జనాభా ఉన్న టంగుటూరు గ్రామ పంచాయతీ అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్యలు తీరడంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ నిర్మాణంతో మండల కేంద్రం బనగానపల్లెకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే సమస్యలు తీరుతున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకే సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు టంగుటూరు రైతులు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. ఇద్దరు వైద్యాధికారులతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో రహదారి సమస్యలు తీరాయి. మంచినీటి సమస్య పరిష్కారానికి గ్రామ సమీపంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించిన తీరును అభినందిస్తున్నారు. అదేవిధంగా గ్రామ సమీపంలో వెలసిన పెద్దమ్మ భక్తుల సౌకర్యార్థం మినరల్ వాటర్‌ట్యాంకును ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పెద్దమ్మ భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టంగుటూరు అభివృద్ధి చూడు అనేలా మారిందా గ్రామం రూపురేఖలు. దీంతో ఎమ్మెల్యే కాటసానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు టంగుటూరు గ్రామస్తులు.

టంగుటూరు జరిగిన అభివృద్ధి పనులు

- రూ.1.80 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- రూ.43.69 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం
- రూ.35లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ఏర్పాటు
- రూ.60లక్షలు సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.25లక్షలు పైప్‌లైన్ ఏర్పాటు
- రూ. 5లక్షలు మినరల్ వాటర్ ప్లాంట్



కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



రూ.35లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు



రూ.43.60లక్షలతో నిర్మించిన సచివాలయం

గ్రామం కళకళలాడుతుంది



గతంలో పోలిస్తే ప్రస్తుతం గ్రామం కళకళలాడుతుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు సచివాలయం, ఆర్బీకే ఏర్పాటుతో సమస్యలన్నీ ఇక్కడే తీరుతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం తప్పింది. సీసీ రోడ్లు నిర్మాణం సంతోషకరం.

– సురేష్‌కుమార్‌రెడ్డి, టంగుటూరు

రహదారి సమస్యలు తీరాయి



గ్రామంలో నెలకొన్న సమస్యలు తీరాయి. రోడ్లు గుంతలపడి రాకపోకలకు ఇబ్బంది పడేవారం. సీసీ రోడ్ల నిర్మాణంతో రాకపోకలు సులువుగా మారాయి. అదేవిధంగా సచివాలయం, ఆర్బీకే సేవలు సంతృప్తిగా ఉన్నాయి. మండల కేంద్రం బనగానపల్లెకు పోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడే గ్రామంలో దాదాపు అన్ని పనులు అవుతున్నాయి.

– మహనందిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు,టంగుటూరు

ఎమ్మెల్యే కాటసాని సహకారంతో అభివృద్ధి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో మా గ్రామం అభివృద్ధి చెందింది. ప్రత్యేకించి పీహెచ్‌సీ ఏర్పాటుతో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా సీసీ రోడ్లు, సచివాలయం, ఆర్బీకేల ఏర్పాటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంది. ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం.

– హనుమంత్‌రెడ్డి, ఉపసర్పంచ్, టంగుటూరు

నేడు చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం

కొలిమిగుండ్ల: రాఘవరాజుపల్లె–అంకిరెడ్డిపల్లె గ్రామాల మధ్య ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామయ్యస్వామి తెలిపారు. నాలుగు జ్యోతులను ప్రత్యేకంగా అలంకరించి తొగట వీర క్షత్రియులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఊరేగింపు చేస్తారన్నారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురంలో ఇంటి రస్తా విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు. సీతారామాపురం గ్రామానికి చెందిన హరికృష్ణపై ఇంటి రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన గుర్రప్ప, శ్రీను, లక్ష్మీనారాయణ, శివతోపాటు మరి కొంత మంది గొడవపెట్టుకొని దాడి చేశారు. హరికృష్ణతోపాటు అతని భార్య లావణ్య గాయపడ్డారు. అదేవిధంగా తెలుగు రామ సుబ్బమ్మపై హరికృష్ణ, లావణ్య దాడి చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

బేతంచెర్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శమైన మనసంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తున్నట్లు వీహెచ్‌పీ నంద్యాల జిల్లా ఉపాధ్యాక్షులు బుగ్గన చంద్ర మౌలీశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉగాది పండుగను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ క్రోధినామ తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను పట్టణ ప్రముఖులు మారుతి కృష్ణ, గుండాగోపాలు, హుసేన్‌రెడ్డి, హిందూ సోదరులు పుల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నాగ మోహన్ ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీకే మా మద్దతు...టీడీపీలో చేరలేదు



వైఎస్సార్‌సీపీలో కనుక కింది కొట్టాల గ్రామస్తులతో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీకే కొట్టాల గ్రామస్తుల మద్దతు అని జంగిటి సుబ్బయ్య, వెంకటయ్య, ఈశ్వరయ్య, ఎల్ల సుబ్బయ్య , గోరంట్ల మధు గోపాలు తదితరులు తెలిపారు. వారం క్రితం మా గ్రామానికి ప్రచారం నిమిత్తం వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుదామని పిలిచి మాకు ఇష్టం లేకపోయినా టీడీపీ కండువాలు వేశారన్నారు. మా గ్రామానికి నలభైఏళ్లుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతుండగా, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారని, గ్రామ సమీపాన ఉన్న బిల్ల స్వర్గం గుహలను ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మంత్రి బుగ్గనకే తమ సంపూర్ణ మద్దతు అని చెప్పారు. అనంతరం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, మణి వర్ధన్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, రామ్ మోహన్‌రెడ్డి, నవీన్ సాయి సమక్షంలో కొట్టాల గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో కొట్టాల గ్రామస్తులు చిన్న మద్దయ్య, నాగ శేషుడు, శంకరయ్య, చిన్న రాముడు, అనిల్, బాల మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: పార్టీలకు, కులమతాలు అతీతంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరిందని మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రసూల్ అన్నారు. మండల పరిధిలోని జలదుర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు ఆర్థికాభివృద్ధి చెందారన్నారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు సలవాది తిమ్మయ్య, కోల వెంకటేశ్, లక్ష్మణ్, మంగమూరి మధు, బాషా, శ్రీనివాసులు, సలవాది మధు, దస్తగిరి, మోహన్ రాజ్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



శ్రీశైల జగద్గురు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం వస్త్ర సమర్పణ చేశారు. పీఠాధిపతి అనుగ్రహ బాషణ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



బేతంచెర్ల : పంచాంగ శ్రవణం వినిపిస్తున్న వేదపండితులు



బనగానపల్లె: సుంకులమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



డోన్ టౌన్: పాతపేట రాముల దేవాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో మంగళవారం ఉగాది పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రోధినామ సంవత్సరం అన్ని విధాల కలిసి రావాలని కోరుతూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, పట్టణ శివారులోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

కుంటెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని మంగళవారం కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని కుంటెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు పల్లెల్లోని గ్రామ దేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ తోటబుచ్చి రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితుల ఆధ్వర్యంలో పంచాంగశ్రవణ కార్యక్రమం, పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బనగానపల్లె పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కొండపేటలో వెలసిన సుంకులమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

డోన్ టౌన్ : తెలుగు సంవత్సరం ప్రారంభ పండుగ ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఇంటిలో పూజలతో పాటు గ్రామ దేవలైన సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ దేవాలయాలకు వెళ్లి చీర,సారే సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పంచాంగ శ్రవవణం

ఉగాది పర్వ దినం సందర్భంగా హిందూ సంప్రదాయం ప్రకారం పట్టణంలోని పాతపేట రాములదేవాలయంతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లోనూ వేద పండితులు క్రోధి నామ సంవత్సర తెలుగు పంచాంగం వినిపించారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులు, ప్రకృతిలో మార్పులు, భవిష్యత్‌లో జరుగబోయే మంచి, చెడులతో పాటు ప్రజల రాశుల ఆధారంగా ఆదాయ, వ్యయాలు, రాజ్య పూజ్యం, అవమానాలు తదితర విషయాలు విశదీకరించారు. రైతులు ఉగాది పర్వదినం సందర్భంగా ఏరువాక సాగును ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో కుందేలుతో గ్రామ శివారులో పారువేట కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.

మద్దిలేటిస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మంగళవారం క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం వేదపండితులు, అర్చకులు, మంగళవాయిద్యాకారులను ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు సత్కరించారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో ఉగాది వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. క్రోధినామ ఉగాదిని పురస్కరించుకుని యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. రైతులు భూమాతకు పూజలు నిర్వహించి పొలం పనులు ప్రారంభించారు. పట్టణంలో చెన్నకేశవస్వామి, కొలుముల పల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీదేవి, సుంకులాపరమేశ్వరీదేవి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాచూరు హరప్రసాద్ శర్మ పంచాంగాన్ని వినిపించారు. ఈ ఏడాది సాధారణ వర్షాలు కురుస్తాయని. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందన్నారు.



ప్యాపిలి : పంచాంగం వినిపిస్తున్న పురోహితుడు రాచూరు హరిప్రసాద్ శర్మ



కోవెలకుంట్ల: సుంకులమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



కొలిమిగుండ్ల : పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బనగానపల్లె : పంచాంగశ్రవణ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



బిజనవేముల సమీపంలో కళకళలాడుతున్న వంగతోట



అమడాల సమీపంలో పచ్చగా కంది పంట

ఆశాజనకంగా ఎండకారు పంటలు

స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది సాగు చేసిన ఎండకారు పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని బోర్లు, బావులు, చెరువులు తదితర సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. దాదాపు వెయ్యి ఎకరాల్లో బెండ, వంగతో పాటు కంది, కొర్ర, నువ్వులు తదితర ఆరుతడి పంటలు సాగు చేశారు. సాగు నీరు వనరులు పుష్కలంగా ఉండటం, వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్‌సరఫరా చేస్తుండటంతో పైర్లకు సకాలంలో సాగునీరు అందుతోంది. ఆయా ప్రాంతాల్లో వేసవికాలంలో సైతం పైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి.

– కోవెలకుంట్ల

మల్లన్నను దర్శించుకున్న జేసీ రాహుల్‌రెడ్డి



జాయింట్ కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపం వద్ద జాయింట్ కలెక్టర్ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.